సాక్షి ఆదిలాబాద్

శనివారం, 12, జూలై, 2025



చలో.. క్వారీ

మంచిర్యాల జిల్లా ఎంసీసీ క్వారీ గుట్టల్లో ఏటా ఆషాఢ మాసంలో దుర్గాదేవి జాతర నిర్వహిస్తారు. ప్రకృతి ఒడిలో పసందైన వేడుక రేపటి నుంచి షురూ కానుంది. 8లో▸



ముగిసిన ఫుట్‌బాల్ పోటీలు

రామకృష్ణాపూర్‌లోని సింగరేణి ఠాగూర్ స్టేడియంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి బాలికల జూనియర్స్ ఫుట్‌బాల్ పోటీలు శుక్రవారం సాయంత్రం ముగిశాయి. 8లో▸

గరిష్టం/కనిష్టం 32.0/25.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ శాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్‌రూరల్: హెచ్‌సీఎల్ టెక్‌బీ ఆధ్వర్యంలో సాఫ్ట్‌వేర్ రంగంలో ఇంటర్మీడియేట్ చదివిన విద్యార్థులకు అందజేస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. జిల్లా కేంద్రంలోని గిరిజన బాలుర సంక్షేమ పాఠశాల ఆవరణలో శుక్రవారం మెగా జాబ్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఇందులో పాల్గొన్న విద్యార్థులు ఉత్తీర్ణత సాధిస్తే రాష్ట్రంలోని హైదరాబాద్‌తో పాటు ఏపీలోని విజయవాడలో గల హెచ్‌సీఎల్ శాఖలలో శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. అనంతరం మంచి ప్యాకేజీ ఉంటుందన్నారు. కార్యక్రమంలో డీఐఈవో జాదవ్‌గణేశ్, హెచ్‌సీఎల్ కోఆర్డినేటర్ రాజేశ్, స్టార్ 50 కోఆర్డినేటర్ మారుతిశర్మ, విద్యార్థులు ఉన్నారు.

జనాభా నియంత్రణ అందరి బాధ్యత



డీఐవోకు ప్రశంసాపత్రం అందజేస్తూ..

ఆదిలాబాద్‌టౌన్: జనాభా నియంత్రణ అందరి బాధ్యత అని డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ అన్నారు. ప్రపంచ జనాభా నియంత్రణ దినోత్సవం పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌వో సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జనాభా పెరుగుదలతో అనేక సమస్యలు ఉత్పన్నమవుతాయని తెలిపారు. ఒకరిద్దరు పిల్లల్ని కని వారి భవితకు బాటలు వేయాలని కోరారు. జిల్లాలో ఈ ఏడాదిలో 4వేల కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సల లక్ష్యం ఉండగా, ఇప్పటివరకు 44 శాతం ఆపరేషన్లు చేసినట్లు తెలిపారు. అత్యధిక ఆపరేషన్లు నిర్వహించిన డీఐవో వైసీ శ్రీనివాస్‌ను సన్మానించి ప్రశంసా పత్రం అందజేశారు. ఇందులో డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన, టీబీ నియంత్రణ అధికారి సుమలత, జిల్లా మలేరియా నివారణ అధికారి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

స్కానర్‌లో మార్పులు చేపట్టాలి



మాట్లాడుతున్న డీఎస్‌వో వాజిద్ అలీ

ఆదిలాబాద్‌రూరల్: రేషన్‌డీలర్లు స్కానర్‌లో ఎల్–0 స్కాన్‌ను ఎల్–1గా మార్పు చేపట్టాలని జిల్లా పౌరసరఫరాల అధికారి వాజిద్ అలీ అన్నారు. ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని రేషన్ డీలర్లతో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. బియ్యం పంపిణీలో ఇబ్బందులు తలెత్తకుండా కొత్త ఈపాస్ యంత్రాలు పంపిణీ చేస్తున్న ట్లు తెలిపారు. అలాగే డీలర్ల సమస్యలు పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు.

అమర్‌నాథ్ యాత్రలో జిల్లావాసులు



పాదయాత్రలో జిల్లా వాసులు

ఆదిలాబాద్: జమ్మూ కశ్మీర్‌లోని ప్రముఖ శైవక్షేత్రమైన అమర్‌నాథ్ మంచు లింగాన్ని దర్శించుకునేందుకు జిల్లాకు చెందిన భక్తులు తరలివెళ్లారు. శ్రీనగర్ సమీపంలోని పహల్గాం నుంచి ప్రారంభమైన పాదయాత్ర శేష్‌నాగ్ వరకు 16 కిలోమీటర్లు, అక్కడి నుంచి అమర్‌నాథ్ వరకు 20 కిలోమీటర్ల మేర సాగింది. అనంతరం 800 మెట్లను ఎక్కిన తర్వాత శివలింగం దర్శనం అయినట్లు భక్తులు తెలిపారు. ఇందులో జిల్లాకు చెందిన భక్తులు డాక్టర్ కాలే సతీష్, రామగిరి అశ్విన్, అర్జున్, రాకేశ్‌రెడ్డి, జైపాల్ తదితరులు ఉన్నారు.

వాడీవేడిగా దిశ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ గోడం నగేశ్

- పలుశాఖల అధికారుల తీరుపై ఎంపీ, ఎమ్మెల్యేల ఆగ్రహం
- పార్లమెంట్‌లో ఫిర్యాదు చేస్తానని హెచ్చరించిన ఎంపీ నగేశ్
- 'కేంద్ర' పథకాల ప్రగతిపై సుదీర్ఘ సమీక్ష

కైలాస్‌నగర్: కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుకు సంబంధించిన జిల్లాస్థాయి అభివృద్ధి, సమన్వయ, మానిటరింగ్ కమిటీ (దిశ) సమీక్షా సమావేశం శుక్రవారం వాడీవేడిగా సాగింది. ఎంపీ గోడం నగేశ్ అధ్యక్షతన కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో విద్య, వైద్యం, ఐసీడీఎస్, ఇరిగేషన్, గిరిజన సంక్షేమం, మైనింగ్, హార్టికల్చర్, డీఆర్డీఏ, సివిల్ సప్లై, హౌసింగ్, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ, గిరిజన సంక్షేమం, ఇంజినీరింగ్ విభాగం, విద్యుత్, పరిశ్రమలు, వ్యవసాయం వంటి 40 శాఖలపై ఎంపీ సుదీర్ఘంగా సమీక్షించారు. ఆయా శాఖలకు మంజూరైన నిధులు, చేపట్టిన పనుల ప్రగతిపై ఆరా తీశారు. పలు శాఖల అధికారుల తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తీరు మార్చుకోవాలని హెచ్చరించారు. పెండింగ్ ప్రాజెక్టులకు సంబంధించి కేంద్రం నుంచి రావాల్సిన నిధులు తీసుకువచ్చేందుకు కృషి చేస్తానని అవసరమైన ప్రతిపాదనలు అందించాలని అధికారులను ఆదేశించారు. సీఎస్‌సీ డీఎం రాహుల్‌కు అవార్డు రావడంపై అభినందించిన ఎంపీ అధికారులతో చప్పట్లు కొట్టించారు. సమావేశంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, కలెక్టర్ రాజర్షి షా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ట్రెయినీ కలెక్టర్ సలోని చాబ్రా, డీఎఫ్‌వో ప్రశాంత్ బాజీరావు పాటిల్, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన వివిధ శాఖల అధికారులు

సమాచారం ఇవ్వరా.. తమాషా చేస్తున్నారా : ఎమ్మెల్యే అనిల్ జాదవ్

ఇందిరమ్మ ఇళ్లకు కాంగ్రెస్ నాయకులు భూమిపూజ చేయడంపై బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ తమకు ఎందుకు సమాచారం ఇవ్వడం లేదని పీడీ బసవేశ్వర్‌ను ప్రశ్నించారు. ఇలా భూమిపూజ జరిగిన ఇళ్లను రద్దు చేయించమంటరా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్క హౌసింగ్‌లోనే ఇలా జరుగుతుందని మండలిస్తూ దీనిపై కఠినంగా ఆదేశాలివ్వాలని కలెక్టర్‌కు సూచించారు. నేషనల్ హైవే శాఖపై ఎమ్మెల్యే మాట్లాడుతూ టోల్ ట్యాక్స్ వసూలు చేయడమే తప్ప రోడ్లపై సౌకర్యాలు కల్పించరా అంటూ పీడీని ప్రశ్నించారు. సరైన రక్షణ చర్యలు లేకపోవడంతో మూగజీవాలు రోడ్లపైకి వచ్చి ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. నిర్మల్ జిల్లాలో ఎలాంటి వసతులున్నాయి, ఇక్కడే ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఆదిలాబాద్ జిల్లా అంటే అలసత్వమా అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

పార్లమెంట్‌లో ఫిర్యాదు చేస్తే ఇబ్బందులు పడుతారు.. : ఎంపీ నగేశ్

'అనిల్‌జాదవ్ నేను ప్రచారంలో తిరిగి గెలిపించుకున్న ఎమ్మెల్యే.. ఇందిరమ్మ భూమి పూజలో ఎక్కడా కనిపించడం లేదు. అలాగే ఆదిలాబాద్‌లో పాయల్ శంకర్ కూడా కనిపిస్తలేడు. పార్లమెంట్‌లో మీపై ఫిర్యాదు చేస్తే తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఎంపీ నగేశ్ హౌసింగ్ పీడీని హెచ్చరించారు. కలెక్టర్ కల్పించుకుని రాజకీయ జోక్యంలేకుండా జిల్లా ఇన్‌చార్జి మంత్రి దృష్టికి తీసుకెళుతానని తెలిపారు. పంచాయతీరాజ్ రోడ్లకు సైతం ఇలాగే కొబ్బరికాయలు కొడుతున్నారని పరోక్షంగా అధికారపార్టీ నాయకుల తీరును తప్పుపట్టారు. పాలంబాట రోడ్లపై సమీక్షించిన ఎంపీ జిల్లాలో 610 కిలోమీటర్లు మంజూరు చేస్తే తనను కేవలం 25 కిలోమీటర్లకే ప్రతిపాదనలు అడిగారని పీఆర్ ఈఈ రాథోడ్ శివరామ్‌ను ప్రశ్నించారు. దీనిపై ఈఈ ఇస్తాను సార్.. అని సమాధానమివ్వగా నేను బిచ్చమడుకోవాల్నా అని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తనను డిగ్రేడ్ చేశారని పార్లమెంట్‌లో ప్రివిలేజ్ మోషన్ మూవ్ చేస్తే మిమ్మల్నెవరూ కాపాడలేరని ఘాటుగానే మందలించారు. కేజీబీవీలు, ఆశ్రమపాఠశాలలకు ప్రహరీలు ఇవ్వరు.. సీసీ రోడ్లు ఇవ్వరు ఇంతేనా అని ప్రశ్నించగా.. అంతే సార్ అని ఈఈ సమాధానమివ్వడంతో మరింత ఆగ్రహానికి గురయ్యారు. కామన్‌సెన్స్ లేదా మాట్లాడే విధానం తెలియదా అంటూ ఫైర్‌అయ్యారు. విద్యాశాఖ అధికారులు సరైన వివరాలతో రాకపోవడంపై వారిని మందలించారు. పెన్‌గంగ నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తూ రూ.కోట్లు సంపాదిస్తుంటే ఏం చేస్తున్నారని మైనింగ్ ఏడీ రవీందర్‌ను ప్రశ్నించారు. పెద్ద వాగు నుంచి ఇసుక తీసుకొచ్చి అక్రమంగా విక్రయాలు సాగిస్తుంటే ఎందుకు కట్టడిచేయడం లేదని దానిపై చర్యలు తీసుకోవాలని సూచించారు.

పనిచేసే వారికే పదవులు



మాట్లాడుతున్న అనిల్‌కుమార్ యాదవ్, చిత్రంలో ఎమ్మెల్సీ దండె విఠల్, ఎమ్మెల్యే బొజ్జు తదితరులు

- సామాజిక వర్గాల సమతుల్యతతో జిల్లా కమిటీ
- కాంగ్రెస్ జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్

కైలాస్‌నగర్: కాంగ్రెస్ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేసిన వారికే తగిన గుర్తింపు లభిస్తుందని రాజ్యసభ సభ్యుడు, పార్టీ సంస్థాగత ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి ఎం.అనిల్ కుమార్ యాదవ్ అన్నారు. పట్టణ శివారులోని రత్నాగార్డెన్‌లో శుక్రవారం నిర్వహించిన పార్టీ జిల్లా విస్తృతస్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శ్రేణులనుద్దేశించి మాట్లాడారు. గతంలో జిల్లా అధ్యక్ష పదవీ గాంధీభవన్ నుంచి పేరును ఢిల్లీకి సిఫారసు చేసిన వ్యక్తికే వచ్చేదన్నారు. ప్రస్తుతం పార్టీశ్రేణల అభిప్రాయం మేరకే అధ్యక్షుడి ఎంపిక జరుగుతుందన్నారు. సామాజిక వర్గాల సమతుల్యత ఆధారంగా అన్ని వర్గాలతో కూడిన జిల్లా కాంగ్రెస్ కమిటీని త్వరలోనే ప్రకటిస్తామన్నారు. ఎన్నికల సమయంలో ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ ఇచ్చిన హామీ మేరకు బీసీలకు 42శాతం రిజర్వేషన్లను కల్పించేలా సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కేబినెట్ తీర్మానం చేసిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం సామాజిక న్యాయం కోసం పనిచేస్తోందన్నారు. రానున్న రోజుల్లో కష్టపడి పనిచేస్తే అందరికీ పదవులు దక్కనున్నాయన్నారు. పునర్విభజనతో రాష్ట్రంలో నియోజకవర్గాల సంఖ్య 153కు పెరుగనుందన్నారు. దీంతో మహిళలకు పెద్దఎత్తున అవకాశాలు రానున్నాయని తెలిపారు. మాజీ మంత్రి రాంచంద్రారెడ్డి ఆశీర్వాదంతో తాను యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా గెలుపొందినట్లుగా గుర్తుచేశారు. పార్టీ పదవులు రానివారికి నామినేటెడ్ పోస్టులు వచ్చేలా కృషి చేస్తామన్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు తగు ప్రాధాన్యత కల్పించేలా కమిటీని నియమిస్తామన్నారు. అంతకుముందు కేబినెట్‌తీర్మానాన్ని హర్షిస్తూ రాహుల్ గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్‌ల ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. కాగా అంతకు ముందు జిల్లాకు చేరుకున్న ఆయనకు పార్టీ నాయకులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. ఇందులో ఎమ్మెల్సీ దండే విఠల్, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, మాజీ ఎంపీ సోయం బాపూరావు, మాజీఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు, ఏఐసీసీ సభ్యులు నరేశ్‌జాదవ్, ఆదిలాబాద్, బోథ్, ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జీలు కంది శ్రీనివాసరెడ్డి, ఆడె గజేందర్, శ్యామ్‌నాయక్, ఇంద్రకరణ్ రెడ్డి, గోక గణేశ్‌రెడ్డి, ఆత్రం సుగుణ, బోరంచు శ్రీకాంత్‌రెడ్డి, చరణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

కైలాస్‌నగర్: దేశంలోని రాజ్యాంగ సంస్థలను నిర్వీర్యం చేస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ యత్నాలను తిప్పి కొట్టాలని కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి జిల్లా సంస్థాగత ఇన్‌చార్జి, అనిల్‌కుమార్ యాదవ్ అన్నారు. శుక్రవారం పార్టీ ఆధ్వర్యంలో రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

డుమ్మా టీచర్లకు చెక్!

- ఉపాధ్యాయులకూ 'ఫేషియల్ రికగ్నిషన్'
- కసరత్తు చేస్తున్న ప్రభుత్వం
- త్వరలోనే అమలుకు చర్యలు
- గురువుల సమయపాలనపై ఫోకస్



విద్యార్థుల ఫేషియల్ రికగ్నిషన్ హాజరు తీసుకుంటున్న ఉపాధ్యాయులు

ఆదిలాబాద్‌టౌన్: డుమ్మా టీచర్లకు చెక్ పెట్టేందుకు విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. చాలామంది ఉపాధ్యాయులు సమయపాలన పాటించకుండా ఇష్టారీతిన విధులకు హాజరవుతున్నారు. దీంతో విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందడం లేదు. ప్రాథమిక పాఠశాలల్లో కొంత మంది విధులకు హాజరుకాకపోయినా మరుసటి రోజు వచ్చి రిజిస్టర్‌లో సంతకాలు పెడుతున్నట్లు తెలుస్తోంది. ఇంకొందరు పాఠశాల పనివేళలకు ముందుగానే ఇంటిముఖం పట్టడం, రియల్‌ఎస్టేట్ వ్యాపారాలు నిర్వహించడం, చిట్టీలు నడపడం, ఇతర వ్యాపకాల్లో నిమగ్నమవుతూ విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్నారు. కోవిడ్‌కు ముందు సర్కారు పాఠశాలల్లో బయోమెట్రిక్ అమలు చేశారు. ఈ క్రమంలో ఉపాధ్యాయులు విధులకు సక్రమంగా హాజరయ్యారు. ఆ తర్వాత అవి మూలనపడడంతో పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. ఈ క్రమంలో టీచర్లకు ఫేషియల్ రికగ్నిషన్ హాజరు అమలుకు ప్రభుత్వం నిర్ణయించింది. పెద్దపల్లి జిల్లాలో పైలట్ ప్రాజెక్ట్ కింద అమలు చేశారు. సత్ఫలితాలు ఇవ్వడంతో రాష్ట్రవ్యాప్తంగా అమలుకు విద్యాశాఖ ఉన్నతాధికారులు చర్యలు చేపడుతున్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచే అమలు చేసేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం విద్యార్థులకు ఫేషియల్ రికగ్నిషన్ హాజరు అమలవుతున్న విషయం తెలిసిందే. టీచర్లకు కూడా అమలు చేస్తే సక్రమంగా విధులకు హాజరయ్యే అవకాశం ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

మూలనపడ్డ బయోమెట్రిక్..

సర్కారు బడుల్లో ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలనే ఉద్దేశంతో 2018లో ప్రభుత్వం బయోమెట్రిక్ యంత్రాలను తీసుకొచ్చింది. చాలా మంది టీచర్లు 'ట్రిక్స్'ఉపయోగించి అవి అమలుకు నోచుకోకుండా చేశారు. నెట్‌వర్క్ సమస్య, యంత్రాల మరమ్మతులు, తదితర కారణాలు చూపుతూ హాజరు వేయకుండానే తప్పించుకొని తిరిగారు. ఇది విద్యార్థుల చదువుపై తీవ్ర ప్రభావం చూపింది. సర్కారు బడుల్లో చదివే సగం మంది విద్యార్థులకు చదవడం, రాయడం, చతుర్విధ ప్రక్రియలు చేయడంలో వెనుకబడ్డారనేది తాజాగా పరఖ్, ఇతర సర్వేల్లో వెల్లడైంది. పర్యవేక్షించాల్సిన అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తుండడంతోనే ఈ దుస్థితి నెలకొందని పలువురు పేర్కొంటున్నారు. కరోనా తగ్గుముఖం పట్టిన తర్వాత యంత్రాలను పునఃప్రారంభించాలని అధికారులు ఆదేశాలు జారీ చేసినప్పటికీ కొన్ని నెలలు మాత్రమే వాటిని ఉపయోగించి మూలన పడేశారు. ఈ యంత్రాలు పనిచేసిన సమయంలో సమయపాలన పాటించేందుకు పరుగులు తీసిన టీచర్లు.. ప్రస్తుతం బయోమెట్రిక్ భయం లేకపోవడంతో ఎప్పుడైనా వెళ్లొచ్చన్న విధంగా వ్యవహరిస్తున్నారు. అధికారులు పర్యవేక్షణను పూర్తిగా గాలికి వదిలేశారు.

సొంత పనుల్లో నిమగ్నం..

ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠాలు బోధించడం కంటే వారి సొంత పనుల్లోనే నిమగ్నమవుతున్నారనే విమర్శలు ఉన్నాయి. పర్యవేక్షణ లేకపోవడంతో ఇష్టమొచ్చినప్పుడు పాఠశాలకు రావడం, సెలవు కాకముందే ఇంటి ముఖం పట్టడం, మధ్యాహ్న సమయం తర్వాత పాఠశాలల్లో ఉండకుండా కొంతమంది తమ వ్యాపారాలు, చిట్టీలు, రియల్ ఎస్టేట్ దందాల్లో మునిగి తేలుతున్నారు. ప్రాథమిక పాఠశాలల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఒకరిద్దరు ఉపాధ్యాయులు పనిచేసే చోటా పనులకు వెళ్లినప్పటికీ సెలవు పత్రం సమర్పించకుండా డుమ్మా కొడుతున్నారు. అందరు ఉపాధ్యాయులు ఒకటై వంతుల వారీగా విధులు నిర్వహిస్తున్నట్లు సమాచారం.

జిల్లాలో..

ప్రాథమిక పాఠశాలలు	500
ప్రాథమికోన్నత పాఠశాలలు	119
ఉన్నత పాఠశాలలు	120
ఉపాధ్యాయ పోస్టులు	3,067
పనిచేస్తున్న వారు	2,654
ఖాళీలు	413
బయోమెట్రిక్ హాజరు వేసే ఉపాధ్యాయులు, సిబ్బంది	65వేలు

మొబైల్ యాప్‌లోనే..

జిల్లాలోని మారుమూల మండలాలైన ఇంద్రవెల్లి, నార్నూర్, గాదిగూడ, బేల, బజార్‌హత్నూర్, తలమడుగు, భీంపూర్ తదితర మండలాల్లో చాలా మంది ఉపాధ్యాయులు సమయపాలన పాటించడం లేదని తెలుస్తోంది. ఇలాంటి వాటికి చెక్ పెట్టేందుకు ఫేషియల్ రికగ్నిజేషన్ హాజరు దోహద పడనుంది. ఉపాధ్యాయులు తమ మొబైల్ ఫోన్‌లోనే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని ఫొటో తీయాల్సి ఉంటుంది. ఈ హాజరు జిల్లా విద్యా శాఖ అధికారితో పాటు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ కార్యాలయానికి అనుసంధానం ఉంటుంది. దీంతో ఉపాధ్యాయుడు ఏ సమయానికి బడికి వస్తున్నాడు.. ఎప్పుడు ఇంటిముఖం పడుతున్నారనే విషయాలు తెలియనున్నాయి. అయితే గతంలో మాదిరిగానే బయోమెట్రిక్ హాజరుకు సాంకేతిక కారణాలు ఏవిధంగా చూపారో.. వీటికి కూడా అలాగే చూపి తప్పించుకునే ప్రయత్నాలు చేసే అవకాశాలు లేకపోలేదు.

ఇంకా ఉత్తర్వులు రాలేదు



ఉపాధ్యాయులు సమయపాలన పాటించి విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన చేయాలి. ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులకు నమ్మకం పెరిగేలా విధులు నిర్వర్తించాలి. ఫేషియల్ రికగ్నిషన్ హాజరుకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఇంకా ఉత్తర్వులు రాలేదు. ఈ విషయమై విద్యాశాఖ చర్చిస్తోంది. త్వరలో అమలు చేసే అవకాశముంది.

– శ్రీనివాస్‌రెడ్డి, డీఈవో

అంతా.. మా ఇష్టం!

- జిల్లాలో విద్యాశాఖ తీరిది
- కేజీబీవీ సీఆర్టీ పోస్టుల భర్తీలో నిర్లక్ష్యం
- 7వ ర్యాంకర్‌కు బదులు తదుపరి అభ్యర్థికి పోస్టింగ్
- ఆరు నెలల తర్వాత వెలుగులోకి..



సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

ఆదిలాబాద్‌టౌన్: ఎన్ని విమర్శలు ఎదుర్కొంటున్నా జిల్లా విద్యాశాఖ తీరు మాత్రం మారడం లేదు. నిరుద్యోగ అభ్యర్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మంచి ర్యాంకులు తెచ్చుకున్న వారికి కాకుండా అనర్హులకు పోస్టింగ్ ఇస్తూ నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నట్లు తెలుస్తోంది. ఇదివరకు డీఎస్సీ ప్రక్రియలో పలు తప్పిదాలు చేసిన అధికారులు మళ్లీ పునరావృతం చేశారు. కేజీబీవీలో సీఆర్టీ పోస్టుకు సంబంధించి ఈ తతంగం ఆలస్యంగా బయటకు వచ్చింది. ఆరు నెలల క్రితం కేజీబీవీ ఉద్యోగాల ప్రక్రియలో అర్హులైన అభ్యర్థికి కాకుండా ఆ తర్వాత ర్యాంక్ వచ్చిన వారికి పోస్టింగ్ కల్పించారు. ఇటీవల కేజీబీవీలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి సంబంధించి నోటిఫికేషన్ వెలువడడంతో సదరు అభ్యర్థి విద్యాశాఖ కార్యాలయానికి వెళ్లి వెకెన్సీల గురించి అడిగి తెలుసుకున్నారు. ఎస్టీ రోస్టర్‌లో ఇదివరకే పోస్టు భర్తీ అయ్యిందని, ఇప్పుడు ఆ పోస్టు ఖాళీగా లేదనడంతో ఆమె అవాక్కయ్యారు. తనకు దక్కాల్సిన పోస్టు మరో అభ్యర్థికి ఇచ్చారని అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, పరిశీలిస్తామంటూ దాటవేశారు. దీంతో ఆమె విద్యాశాఖ కార్యాలయంలోని ఇన్‌వార్డులో ఫిర్యాదు చేశారు. తర్వాత కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో విషయం బయటకు వచ్చింది.

అసలేం జరిగిందంటే..

గత డిసెంబర్‌లో కేజీబీవీలో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేసేందుకు విద్యాశాఖ అధికారులు నోటిఫికేషన్ విడుదల చేశారు. సీనియారిటీ జాబితాలో ఉన్న అభ్యర్థులకు ఫోన్ చేసి సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరు కావాలని సూచించారు. 1:2 ప్రకారం వెరిఫికేషన్ జరిగింది. ఇంతవరకు బాగానే ఉన్నా.. ఫిజికల్ సైన్స్‌లో రోస్టర్ నం.8కి పోస్టింగ్ ఇవ్వాల్సి ఉంది. 2023 జూన్ 16న రాత పరీక్షలో అర్హత సాధించి మెరిట్, రోస్టర్ ప్రకారం పోస్టు భర్తీ చేయాలి. అయితే ఫిజికల్ సైన్స్‌లో 7వ ర్యాంక్ అభ్యర్థి జాదవ్ జ్యోతికి బదులు ఆ తర్వాత ర్యాంక్ ఉన్న అభ్యర్థికి పోస్టింగ్ ఇచ్చారు. సదరు అభ్యర్థికి ఈ విషయం తెలియదు. ఇటీవల మళ్లీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల కావడంతో డీఈవో కార్యాలయానికి వెళ్లి పోస్టుల గురించి ఆరా తీయగా ఇదివరకే ఆ పోస్టు భర్తీ అయ్యిందని చెప్పడంతో ఖంగుతిన్నారు. తనకు దక్కాల్సిన పోస్టును మరొకరికి ఇచ్చారని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

అధికారుల తీరుపై కలెక్టర్ ఫైర్..

ఒకరికి బదులు మరొకరికి పోస్టింగ్ ఇవ్వడంపై విద్యాశాఖ అధికారులను పిలిచి కలెక్టర్ రాజర్షిషా ఫైర్ అయ్యారు. తమ తప్పును కప్పిపుచ్చుకునేందుకు అధికారులు ఏదో ఒకటి చెప్పి తప్పించుకునే ప్రయత్నం చేశారు. అయితే 8వ ర్యాంక్ అభ్యర్థిని తొలగించి 7వ ర్యాంక్ అభ్యర్థికి పోస్టింగ్ ఇవ్వాలని ఆదేశించినట్లు తెలుస్తోంది. దీంతో సదరు అభ్యర్థి సర్టిఫికెట్లను అధికారులు పరిశీలించారు. ఇదిలా ఉండగా ఈ తప్పిదం కావాలనే చేశారా.. లేక పొరపాటు జరిగిందా అనేది తెలియడం లేదు. సెక్షన్ క్లర్క్, సూపరింటెండెంట్, కేజీబీవీ సెక్టోరియల్ అధికారి, విద్యాశాఖ ఏడీ, డీఈవో, ఆ తర్వాత వెరిఫికేషన్ కమిటీ సభ్యులు పరిశీలిస్తారు. ఇంత మందిలో నుంచి ఏఒక్కరు కూడా విషయాన్ని పసిగట్టకపోవడంపై ఆంతర్యమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

పొరపాటు జరిగింది..

గత డిసెంబర్‌లో జరిగిన కేజీబీవీ సీఆర్టీ ప్రక్రియలో పొరపాటుతో వేరే అభ్యర్థికి పోస్టింగ్ కల్పించడం జరిగింది. రోస్టర్ నం.8 ఉండడంతో ర్యాంక్ అదే అనుకొని పోస్టింగ్ ఇచ్చాం. ఇటీవల సదరు అభ్యర్థి మా దృష్టికి తీసుకొచ్చారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆ తప్పిదాన్ని సవరించి ఏడో ర్యాంక్ అభ్యర్థికి పోస్టింగ్ కల్పిస్తాం.

– ఉదయశ్రీ, కేజీబీవీ సెక్టోరియల్ అధికారి



అక్రమంగా చేపట్టిన మొరం తవ్వకాలతో ఏర్పడిన గుంతలు

గుంతలు.. ప్రమాదాలకు నిలయాలు

ప్రభుత్వ, అసైన్డ్ భూముల్లో అక్రమంగా చేపట్టిన మొరం తవ్వకాలతో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడుతున్నాయి. వర్షాకాలంలో అందులో నీరు నిలిచి ప్రమాదకరంగా మారుతున్నాయి. ఇటీవల మావలకు చెందిన చిన్నారులు అందులో పడి మృత్యువాత పడిన విషయం తెలిసిందే. మావల శివారు, కజ్జర్ల ప్రాంతంలో ఇలాంటివి అనేకం ఉన్నాయి. మొరం తవ్వకాల అనంతరం అక్కడ ఫెన్సింగ్, రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

ర్యాపిడ్ ఫీవర్ సర్వే పకడ్బందీగా నిర్వహించాలి



వివరాలు తెలుసుకుంటున్న కుడ్మేత మనోహర్

ఇంద్రవెల్లి: ర్యాపిడ్ ఫీవర్ సర్వే పకడ్బందీగా నిర్వహించాలని ఏజెన్సీ అదనపు జిల్లా వైద్యాధికారి కుడ్మేత మనోహర్ అన్నారు. మండలంలోని పిట్టబొంగరం పీహెచ్‌సీ పరిధిలోని పలు గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన ర్యాపిడ్ ఫీవర్ సర్వేను పరిశీలించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. వైద్యుడు ప్రతాప్‌నాయక్, సిబ్బంది నాందేవ్, జలంధర్ తదితరులున్నారు.

క్లుప్తంగా

సినిమా టెక్నాలజీ కోర్సుల్లో శిక్షణ

ఆదిలాబాద్‌టౌన్: న్యాక్ ఆధ్వర్యంలో హైదరాబాద్ సినిమా టెక్నాలజీ, సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో మూడు నెలల శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని న్యాక్ ఉమ్మడి జిల్లా ఏడీ నాగేంద్రం, జిల్లా ఇన్‌చార్జి ద్యావంత్ రమేశ్ ఓ ప్రకటనలో తెలిపారు. సినిమాటోగ్రఫీ, వీడియో ఎడిటింగ్, మ్యూజిక్ ప్రొడక్షన్, డబ్బింగ్, సౌండ్ రికార్డింగ్, యాంకరింగ్ కోర్సుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఫీజు రూ.35వేలు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాలకు 9866565156 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

పోక్సో కేసులో ఒకరికి జైలు

నిర్మల్‌టౌన్: పోక్సో కేసులో ఒకరికి నాలుగేళ్ల జైలు శిక్ష, జరిమానా విధిస్తూ నిర్మల్ న్యాయస్థానం తీర్పునిచ్చింది. కోర్టు సమన్వయ అధికారి డల్లు సింగ్ తెలిపిన వివరాల ప్రకారం.. 2020లో సోన్ మండలం జాఫ్రాపూర్ గ్రామానికి చెందిన దుమ్మల శ్రీనివాస్ అదే గ్రామానికి చెందిన 13 ఏళ్ల చిన్నారిపై లైంగికదాడికి యత్నించాడు. దీంతో బాలిక కుటుంబ సభ్యులు సోన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టి చార్జిషీట్ దాఖలు చేసి కోర్టులో ప్రవేశపెట్టారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ వినోద్‌రావు సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టి నేరం రుజువు చేశారు. ఈ మేరకు జిల్లా జడ్జి శ్రీవాణి నిందితుడికి నాలుగేళ్ల జైలు శిక్ష, రూ.6వేల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు.

ప్రమాదవశాత్తు స్కూటీ దగ్ధం



దగ్ధమవుతున్న స్కూటీ

దహెగాం: మండలంలోని ఒడ్డుగూడ గ్రామానికి చెందిన రైతు మల్లేశ్‌కు చెందిన స్కూటీ ప్రమాదవశాత్తు దగ్ధమైంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లేశ్ శుక్రవారం పని నిమిత్తం ఒడ్డుగూడ నుంచి దహెగాంకు వచ్చి తిరిగి వెళ్తున్న క్రమంలో లగ్గాం సమీపంలో స్కూటీకి వెనకాల మంటలు చెలరేగాయి. వెనుక వస్తున్న మరో ద్విచక్ర వాహనదారుడు గమనించి కేకలు వేయగా మల్లేశ్ స్కూటీని నిలిపాడు. మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా ప్రయోజనం లేకపోయింది. స్కూటీ పూర్తిగా దగ్ధమైంది. షార్ట్ సర్క్యూట్‌తోనే స్కూటీ దగ్ధమై ఉంటుందని బాధితుడు తెలిపాడు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

చింతలమానెపల్లి: దిందా వాగులో గల్లంతైన సెడ్మెక సుమన్ (18) మృతదేహం శుక్రవారం మధ్యాహ్నం లభ్యమైంది. గురువారం కేతిని గ్రామానికి చెందిన సుమన్ తన స్నేహితులతో కలిసి దిందా వాగుకు అవతలి వైపునున్న వ్యవసాయ భూమికి వెళ్తుండగా గల్లంతయ్యాడు. స్నేహితులు అందించిన సమాచారంతో అక్కడికి చేరుకున్న గ్రామస్తులు, పోలీసులు గాలింపు చర్యలు చేపట్టినా వరద ఉధృతి కారణంగా ముందుకు సాగలేదు. శుక్రవారం ఉదయం నుంచే ఎస్సై నరేశ్ ఆధ్వర్యంలో గాలింపు చర్యలు చేపట్టారు. వాగు ఉధృతి తగ్గిన అనంతరం మృతదేహం గల్లంతైన స్థలం నుంచి సుమారు కిలోమీటర్ దూరంలో లభ్యమైంది. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

Wanted Auto Driver Cum Delivery Boy 5 nos salary 15K+Accommodation & food, Sales Executives 5 nos 18K + Accommodation and food for FMCG Company at Jalpally Preference will be given for scooter owners Hyderabad. Ph: 8367676262, 9885624923, 8978662887 [HA-5441]

www.sakshi.com

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888
9010299065
9951602823
9010608462

చలో.. క్వారీ



క్వారీలోని దుర్గాదేవి, పోచమ్మ ఆలయాలు

ఎత్తయిన కొండలు.. అందమైన రహదారులు.. దట్టమైన అటవీ ప్రాంతం.. అడవి మధ్య అందమైన ఆలయం.. పక్షుల కిలకిల రావాలు.. అందులో అందమైన నీటి కొలనులు.. వెరసి... మంచిర్యాల జిల్లాలోని ఎంసీసీ క్వారీ.. ఇక్కడో ప్రత్యేకత ఉంది.. అదే ప్రతీ ఏడాది ఆషాఢ మాసంలో క్వారీ గుట్టల్లోని దుర్గాదేవి జాతర. ప్రకృతి ఒడిలో కొలువైన దుర్గమ్మ భక్తుల మొక్కులు అందుకుంటూ కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా విరాజిల్లుతోంది. మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం గఢ్‌పూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని ఎంసీసీ (ఏసీసీ) క్వారీ దుర్గాదేవి జాతరను ఆదివారం నిర్వహించనున్నారు. దుర్గాదేవి జాతర 54వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ విస్తృత ఏర్పాట్లు చేసింది.

– మంచిర్యాలరూరల్(హాజీపూర్)

- రేపటి నుంచి జాతర ప్రారంభం
- ప్రకృతి ఒడిలో పసందైన వేడుక
- భారీగా తరలిరానున్న భక్తులు
- 54వ వార్షికోత్సవానికి ఏర్పాట్లు



ఆలయంలోని దుర్గామాత విగ్రహం



నాగదేవత ఆలయం

ఇదీ.. ప్రాముఖ్యత

మంచిర్యాలలో ఎంసీసీ (గతంలో ఏసీసీ) సిమెంట్ కంపెనీ ఉండేది (ప్రస్తుతం మూతపడింది). ఈ కంపెనీలో హాజీపూర్ మండలం గఢ్‌పూర్, ర్యాలీ, నాగారం, చిన్నగోపాల్‌పూర్ గ్రామాల పరిధిలోని పలు గ్రామాల్లోగల గుట్టల్లో లభించే సిమెంట్ రాయితో సిమెంట్ తయారయ్యేది. తయారీలో తరచుగా ప్రమాదాలు, ప్రాణనష్టం తదితర ఘటనలు చోటు చేసుకున్నాయి. వీటి నివారణకు కార్మికులు, కంపెనీ యాజమాన్యం కలిసి మైసమ్మ, దుర్గాదేవి ఆలయాలను నిర్మించి నాటి నుంచి ఏటా పూజలు నిర్వహించారు. ఈ పూజలకు విశిష్టత ఏర్పడటంతో ఇక అప్పటి నుంచి ఏటా ఆషాఢంలో దుర్గాదేవి జాతర నిర్వహిస్తూ వస్తున్నారు. ఎంసీసీ అధికారులు, కంపెనీ సిబ్బంది కుటుంబ సమేతంగా వచ్చి క్వారీలోని దుర్గాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి రోజంతా అక్కడే ఉండి వంటలు చేసుకుని సామూహిక భోజనాలు చేయడం ఆనవాయితీగా మారింది. ఆలయ ఆవరణలో నాగదేవుడు, పోచమ్మ దేవి ఆలయాలున్నాయి. సికింద్రాబాద్ మహంకాళి జాతర రోజే ఎంసీసీ దుర్గాదేవి జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇక్కడ అమ్మవారికి మొక్కులు సమర్పించిన అనంతరం వాహన పూజలు నిర్వహించి మేకలు, కోళ్లు బలిచ్చి అక్కడే వంటలు చేసుకుని సామూహిక భోజనాలు చేస్తారు. ఈ జాతరకు మంచిర్యాల జిల్లా నలుమూలల నుంచే కాకుండా పొరుగునే ఉన్న పెద్దపల్లి, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలతో పాటు మహారాష్ట్రకు చెందిన భక్తులు కూడా దర్శనం కోసం వస్తుంటారు. దుర్గాదేవి జాతర ప్రాంతమంతా భక్తులతో కిక్కిరిసిపోయి అటవీ ప్రాంతమంతా జనారణ్యమైపోతుంది.

ఆకట్టుకోనున్న ప్రకృతి అందాలు

క్వారీ జాతర దట్టమైన అటవీ ప్రాంతం కాగా అక్కడికి వెళ్లే రహదారి అరకు లోయ, తిరుపతి కొండలను తలపిస్తుంది. ఎత్తయిన గుట్టల నుంచి తీసిన రహదారి, మూల మలుపులు, పచ్చని చెట్లతో కళకళలాడుతుంది. ఎంసీసీ యాజమాన్యం గుట్టలపై పార్కుల నిర్మాణం చేపట్టి పిక్నిక్ స్పాట్‌గా మార్చింది. దీంతో ఆదివారమే కాదు.. ఇప్పుడు ప్రతీరోజు ఇక్కడ ఉత్సాహంగా గడుపుతూ సంతోషంతో ఇంటికి వెళ్తుంటారు. అయితే మొన్నటివరకు ఆహ్లాదాన్ని పంచిన క్వారీ అందాలు, నీటి కొలనులు, పచ్చని పార్కులు, సిమెంట్ రాయి తీసుకెళ్లే ఎలక్ట్రిక్ రోప్‌వే దృశ్యాలు కంపెనీ మూసివేతతో కనుమరుగయ్యాయి. దేవి ఆలయం పక్కనే పర్యాటకుల కోసం కాలక్షేప మండపం ఉండటంతో సమావేశాలు, ఫంక్షన్లకు వేదికగా మారుతోంది. జాతర సందర్భంగా ఆర్టీసీ బస్టాండ్ నుంచి క్వారీ దుర్గాదేవి ఆలయం వరకు ప్రత్యేక బస్సులు నడుస్తాయి. మంచిర్యాల డీసీపీ భాస్కర్, ఏసీపీ ప్రకాశ్, సీఐ ప్రమోద్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రత్యేక ఆకర్షణగా జంగల్ సఫారీ



ఎంసీసీ క్వారీలో ఏర్పాటు చేసిన జంగల్ సఫారీ

ఎంసీసీ క్వారీ అడవిలో నిర్వహిస్తున్న గాంధారీ ఖిల్లా జంగల్ సఫారీ ఇక్కడి ప్రత్యేక ఆకర్షణ. కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలోని పాతమంచిర్యాల అటవీ బీట్ పరిధిలో ఏర్పాటు చేసిన గాంధారీ ఖిల్లా జంగల్ సఫారీలో పెద్దపులి, చిరుత పులులు, ఎలుగుబంట్లు, అడవి బర్రెలు, దుప్పులు, మెఖములు, జింకలు, చుక్కల దుప్పులు, అడవి కుక్కలు, నక్కలు, సాంబార్‌లు, అడవి పందులు, నెమళ్లు ఇలా పలు రకాల వన్యప్రాణులను సఫారీలో పర్యటిస్తూ ప్రత్యక్షంగా వీక్షించవచ్చు. 25కిలో మీటర్ల సఫారీలో వ్యూ పాయింట్లు, మంచెలు, వాచ్ టవర్లు, నీటి కుంటలు, చారిత్రాత్మక ప్రాంతమైన గాంధారీ ఖిల్లా, పలు రకాల జంతువులు, అటవీ అందాలు చూపరులకు ఆహ్లాదాన్ని పంచుతాయి.

వాగు దాటి.. వైద్యం అందించారు



వాగు దాటి వెళ్తున్న వైద్య సిబ్బంది

నార్నూర్: రెండురోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఏజెన్సీ ప్రాంతాల్లో వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. నార్నూర్ మండలంలోని బారిక్ రావుగూడ, దన్నుగూడ, గాదిగూడ మండలంలోని కునికాసా, అర్జుని మారుగూడా తదితర గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. శుక్రవారం వర్షం తగ్గుముఖం పట్టడంతో గాదిగూడ ఝరి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది మండలంలోని అర్జుని మారుగూడా గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించడానికి వాగు దాటి వెళ్లారు. వైద్య సామగ్రిని నెత్తి మీద పెటుకుని మోకాళ్లలోతు నీటిలోంచి వెళ్లి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్త్ సూపర్‌వైజర్ ఆడే సంజయ్ మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సమస్యాత్మక గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇళ్లు, పరిసరాల్లో వర్షపు నీరు నిల్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. వైద్యశిబిరంలో ఏఎన్‌ఎం సులోచన, రత్న, సురేఖ, మోహన్, ఆశ కార్యకర్త సురాబాయి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఫుట్‌బాల్ పోటీలు



మొదటి స్థానంలో నిలిచిన నిజామాబాద్ జట్టు



ద్వితీయ స్థానంలో నిలిచిన ఖమ్మం జట్టు

- విజేతగా నిజామాబాద్ జట్టు
- రన్నరప్‌గా ఖమ్మం జట్టు

రామకృష్ణాపూర్: రామకృష్ణాపూర్‌లోని సింగరేణి ఠాగూర్ స్టేడియంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి బాలికల జూనియర్స్ ఫుట్‌బాల్ పోటీలు శుక్రవారం సాయంత్రం ముగిశాయి. లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో పోటీలు నిర్వహించగా నిజామాబాద్, ఖమ్మం జట్లు ఫైనల్‌కు చేరాయి. ఫైనల్‌లో నిజామాబాద్ జట్టు 3–0 గోల్స్ తేడాతో ఖమ్మంపై గెలిచి 11వ రాష్ట్రస్థాయి జూనియర్ బాలికల ఛాంపియన్‌గా నిలిచింది. అంతకుముందు ఉదయం సెమీఫైనల్స్‌లో మొదటి మ్యాచ్ నిజామాబాద్–నల్గొండ జట్ల మధ్య జరుగగా 2–0 గోల్స్‌తో నిజామాబాద్ గెలుపొందింది. మరో సెమీఫైనల్‌లో ఖమ్మం–రంగారెడ్డి తలపడగా ఈ మ్యాచ్ హోరాహోరీగా సాగి ఎవరూ గోల్స్ సాధించకపోవడంతో టై అయింది. దీంతో పెనాల్టీ షూటౌట్‌లు నిర్వహించగా 2–1 గోల్స్‌తో ఖమ్మం గెలుపొంది ఫైనల్‌కు అర్హత సాధించింది. కాగా, మూడవ బహుమతిని సెమీఫైనల్స్‌లో ఓడిన నల్గొండ, రంగారెడ్డి జట్లకు సంయుక్తంగా అందించారు.

క్రీడా నైపుణ్యాన్ని పెంచుకోవాలి

క్రీడాకారులు క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకుని భవిష్యత్‌లో ఉన్నతంగా రాణించాలని మందమర్రి జీఎం దేవేందర్ సూచించారు. తెలంగాణ రాష్ట్రస్థాయి బాలికల ఫుట్‌బాల్ పోటీల ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఫుట్‌బాల్ క్రికెట్ లాగా మరింత అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్ రాజు, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, పట్టణ ఎస్సై రాజశేఖర్, ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి రఘునాథ్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు పల్లె రాజు, ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శి అక్బర్‌అలీ, కాంగ్రెస్ నాయకులు బండి సదానందం, గాండ్ల సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీలో ఉపాధ్యాయుల ప్రదర్శన



సాంస్కృతిక ప్రదర్శనలో జిల్లా ఉపాధ్యాయులు

నిర్మల్‌ఖిల్లా: ఢిల్లీలో సెంటర్ ఫర్ కల్చరల్ రిసోర్స్ ట్రైనింగ్(సీసీఆర్టీ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఉపాధ్యాయ శిక్షణలో ఉమ్మడి జిల్లా ఉపాధ్యాయులు పాల్గొంటున్నారు. 'రోల్ ఆఫ్ పపెట్రి ఇన్ ఎడ్యుకేషన్ కన్సర్న్ విత్ ఎన్ఈపీ–2020' (బోధనాభ్యసన ప్రక్రియలో తోలుబొమ్మలాట పాత్ర) అనే అంశంపై జాతీయస్థాయి శిక్షణకు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. ఈ నెల 3న ప్రారంభమైన 15రోజుల శిక్షణ 17వరకు కొనసాగనుంది. తెలంగాణ రాష్ట్రం నుంచి పది మంది ఉపాధ్యాయులు ఎంపిక కాగా.. నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలం సేవాలాల్‌తండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు ఎల్మల ప్రవీణ్‌కుమార్, మంచిర్యాల జిల్లా ముల్కలగూడ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు దిలీప్‌కుమార్ ఉన్నారు. శుక్రవారం రాష్ట్ర ఏర్పాటు, స్థానిక సంస్కృతి, జీవన విధానం ప్రతిబింబించేలా ఉపాధ్యాయులు ఇచ్చిన ప్రదర్శన ఆకట్టుకుంది.

అటు తండ్రి మరణం.. ఇటు కడుపు నొప్పి..

- భరించలేక యువతి ఆత్మహత్య



హర్షిత (ఫైల్)

ఇంద్రవెల్లి: అటు తండ్రి మరణం నుంచి కోలుకోలేక.. ఇటు కడుపు నొప్పి భరించలేక యువతి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై సాయన్న, బాధిత కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని హర్కపూర్ కొలాంగూడ గ్రామానికి చెందిన ఆత్రం గణేశ్– అయ్యుబాయి దంపతుల కూతురు హర్షిత (20) గతేడాది ఇంటర్ పూర్తి చేసింది. తండ్రి గణేశ్ గతేడాది అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటి నుంచి హర్షిత నిత్యం తండ్రి మరణాన్ని గుర్తు చేసుకుని బాధపడుతుండేది. దీనికి తోడు కొంతకాలంగా ఆమె కడుపు నొప్పితో బాధ పడుతోంది. కుటుంబ ఆర్థిక పరిస్థితి సరిగా లేక ఆస్పత్రికి వెళ్లలేదు. గ్రామంలో పలుసార్లు నాటు వైద్యం చేయించినా ఆరోగ్యం కుదుటపడలేదు. అటు తండ్రి మరణం.. ఇటు కడుపు నొప్పి భరించలేక హర్షిత శుక్రవారం తెల్లవారుజామున కుటుంబ సభ్యులు నిద్రమత్తులో ఉండగా ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే 108 అంబులెన్స్‌తో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. పోలీసులు రిమ్స్‌కు వెళ్లి వివరాలు సేకరించారు. పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. తల్లి అయ్యుబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ట్రాక్టర్ కింద పడి డ్రైవర్ మృతి



ట్రాక్టర్ కింద పెళ్యారావుసింగ్ మృతదేహం

కడెం: కేజీవీల్స్ ట్రాక్టర్ కిందపడి డ్రైవర్ మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బాబానాయక్‌తండా జీపీ పరిధిలోని మంగల్‌సింగ్ తండాకు చెందిన పెళ్యారావుసింగ్ (47) ట్రాక్టర్ నడుపుకొంటూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం గ్రామ సమీపంలోని గోతి రవీందర్ సాగుభూమిలో కేజీవీల్స్ కొట్టేందుకు వెళ్లాడు. కేజీవీల్స్ కొట్టే క్రమంలో ట్రాక్టర్ బురదలో కూరుకుపోయింది. కేజీవీల్స్‌కు కర్రలు కట్టి బురదలో కూరుపోయిన ట్రాక్టర్‌ను బయటకు తీసే క్రమంలో అదుపుతప్పి బోల్తాపడింది. పెళ్యారావుపై ట్రాక్టర్ పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయికిరణ్ తెలిపారు.

పెద్దవాగులో దూకి ఒకరి గల్లంతు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని జీడి చేను గ్రామానికి చెందిన ఎస్పీఎం కార్మికుడు ముడిగొండ పోచయ్య (55) శుక్రవారం అందవెల్లి పెద్దవాగులో దూకి గల్లంతయ్యాడు. పెద్దవాగు బ్రిడ్జిపై చెప్పులు, గుర్తింపు కార్డులు ఉంచి వాగులోకి దూకాడు. గమనించిన స్థానికులు, కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు. కుటుంబ తగాదాల నేపథ్యంలోనే ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ మేరకు ఈస్‌గాం ఎస్సై కల్యాణ్ ఆధ్వర్యంలో రెస్క్యూ టీం గాలింపు చేపట్టింది.

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య



గణేశ్ (ఫైల్)

ఇచ్చోడ: మండలంలోని కోకస్‌మన్నూర్ గ్రామానికి చెందిన కామ్రె గణేశ్ (32) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గణేశ్ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. మూడురోజుల క్రితం ఆటోను పంచాయతీ కార్యాలయం వద్ద నిలిపి కనిపించకుండా పోయాడు. సెల్‌ఫోన్ స్విచాఫ్ చేశాడు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శుక్రవారం ఉదయం గణేశ్ తల్లి లక్ష్మీబాయి కోకస్ మన్నూర్‌లోని పాత ఇంటికి వెళ్లి తలుపులు తీయగా గణేశ్ మంచంపై పడి ఉన్నాడు. చుట్టుపక్కల వారు వచ్చి చూసి గణేశ్ పురుగుల మందు తాగి అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. ఈ మేరకు సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు, కుమారుడున్నారు. కాగా, గణేశ్ ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

'కడెం' ప్రళయానికి మూడేళ్లు

- ప్రాజెక్టుకు ముందస్తు మరమ్మతు
- వరద తెలిసేలా స్కాడా వ్యవస్థ



కడెం ప్రాజెక్టుకు వచ్చిన భారీ వరద (ఫైల్)

కడెం: జ్ఞాపకాలు అనేక రకాలు. కొన్ని మధుర స్మృతులు.. కొన్ని విషాద ఘటనలు.. మరికొన్ని భయానక సంఘటనలు.. వీటిలో మన ప్రమేయమేమీ ఉండదు. ఇందులోని భయానక పరిస్థితిని నిర్మల్ జిల్లావాసులు మూడేళ్ల క్రితం ఎదుర్కొన్నారు. ముఖ్యంగా కడెం ప్రాజెక్ట్ దిగువ ప్రాంతవాసులకు ఇది మరిచిపోలేని ఘటన. ఆ ఘటనను తలుచుకుంటే ఇప్పటికీ ఒంటిపై రోమాలు నిక్కబొడుచుకుంటాయి. అదే కడెం ప్రాజెక్ట్‌కు పోటెత్తిన భారీ వరద. ప్రళయాన్ని తలపించిన ఈ ఘటన ప్రాజెక్ట్ అధికారులతోపాటు దిగువనున్న గ్రామాల ప్రజలకు 48 గంటలు కంటిమీద కునుకులేకుండా చేసింది.

ముందస్తు మరమ్మతులు

అది 2022 సంవత్సరం జూలై నెల.. 12, 13 తేదీల్లో కడెం ప్రాజెక్ట్ చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో భారీ వరదలు ముంచెత్తాయి. ఈ ప్రళయం ప్రాజెక్ట్ అధికారులు, సిబ్బందితోపాటు లోతట్టు గ్రామాల ప్రజలను భయపెట్టింది. ఈ సంఘటన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు చర్యలతో ప్రాజెక్ట్‌ను సురక్షితం చేసేందుకు కృషి చేసింది. గతేడాది మరమ్మతు పూర్తి చేసిన ప్రభుత్వం ఈ ఏడాది కూడా ముందస్తు మరమ్మతులతో ప్రాజెక్ట్‌ను బలోపేతం చేసింది.

సమాచార వ్యవస్థలో సంస్కరణలు

గతంలో అనూహ్యంగా వచ్చిన భారీ వరదలు ఇరిగేషన్ అధికారులనూ అయోమయంలోకి నెట్టాయి. ఈ నేపథ్యంలో ప్రాజెక్ట్ వద్ద స్కాడా వ్యవస్థను ఏర్పాటు చేశారు. దీని ద్వారా ప్రాజెక్ట్ పరీవాహక ప్రాంతాలైన కుప్టి, ఇటిక్యాల, యాపల్‌గూడ, కుమారి, తర్నం, సత్తుగూడ, రాంనగర్ తదితర గ్రామాల నుంచి వచ్చే వరదల సమాచారాన్ని ముందుగానే తెలుసుకునే అవకాశముంది. అలాగే ఈ గ్రామాల్లో భారీ వర్షాలు, వరదల సమయంలో అధికారులకు సమాచారం అందేలా పటిష్ట సమాచార వ్యవస్థ ఏర్పాటు చేశారు. దీంతో ముందస్తు హెచ్చరికలతో ప్రజలు అప్రమత్తం అయ్యే అవకాశముంది.

ఆందోళన అవసరం లేదు



కడెం ప్రాజెక్టుకు ఈ ఏడాది వర్షాకాల సీజన్‌కు ముందుగానే మరమ్మతులు పూర్తి చేశాం. ప్రాజెక్ట్‌కు ఎలాంటి ఇబ్బంది లేదు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

– విఠల్, ఈఈ, కడెం ప్రాజెక్ట్

మరమ్మతులతో బలోపేతం

2022 జూలై 12, 2023 జూలై 21 తేదీల్లో వచ్చిన భారీ వరదల కారణంగా ప్రాజెక్ట్‌కు తీవ్ర నష్టం వాటిల్లింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.9.46 కోట్లతో మరమ్మతులు చేపట్టారు. గతేడాది ప్రాజెక్ట్ ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోలేదు. ఈ ఏడాది వర్షాకాలం ప్రారంభానికి ముందే 18 వరద గేట్లకు గ్రీసింగ్, కౌంటర్‌వెయిట్ రోప్స్, గ్యాలరీ మరమ్మతులను రూ.12 లక్షలతో పూర్తి చేశారు. అలాగే పెయింటింగ్, లైటింగ్ ఏర్పాటు, సిల్ట్ గేట్లు, సీపేజ్ సమస్యలు పరిష్కరించారు. ఇటీవల ఇరిగేషన్ ఉన్నతాధికారులు ప్రాజెక్ట్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేసిన వ్యక్తి రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్ ఆస్పత్రిలో నర్సు ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్ తెలిపారు. శుక్రవారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ పట్టణానికి చెందిన మహేశ్వరి రిమ్స్‌లో ఏఎన్‌ఎం కోర్సు పూర్తి చేసి శిక్షణ పొందింది. భూపాలపల్లికి చెందిన గజ్జె రాజ్‌కుమార్ అనే వ్యక్తి ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి ఆమె నుంచి రూ.లక్షా 40వేలు వసూలు చేశాడు. ఉద్యోగం ఇప్పించకుండా రేపుమాపు అంటూ తిప్పుకొన్నాడు. 2025 మార్చి 30న ఉద్యోగం ఇప్పించలేనని, డబ్బులు తిరిగి ఇవ్వలేనని నిందితుడు బాధితురాలితో పేర్కొన్నాడు. దీంతో నిందితుడిపై వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అరెస్ట్ చేసి 14 రోజులు రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

కుక్కల దాడిలో బాలుడికి గాయాలు

కాసిపేట: మండలంలోని సోమగూడెం (కె) పంచాయతీ పరిధి ట్యాంక్‌బస్తీకి చెందిన భూక్య లక్ష్మి నరసింహస్వామి అనే బాలుడికి శుక్రవారం కుక్కల దాడిలో తీవ్రగాయాలయ్యాయి. ట్యాంక్‌బస్తీలో వీధి కుక్కల స్వైరవిహారం ఎక్కువగా ఉంది. ఉదయం బాలుడిపై దాడి చేసి గాయపరచడంతో బెల్లంపల్లి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అధికారులు స్పందించి వెంటనే కుక్కల బెడదను తగ్గించాలని స్థానికులు కోరుతున్నారు.

నక్షత్ర ఆస్పత్రిపై కలెక్టర్ కొరడా

- రూ.20వేల జరిమానా
- నిర్వహణ లోపంతో చర్యలు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని నక్షత్ర ప్రైవేట్ ఆస్పత్రిపై కలెక్టర్ రాజర్షిషా కొరడా ఝుళిపించారు. ఇటీవల కలెక్టర్ ఆకస్మికంగా ఆస్పత్రిని తనిఖీ చేశారు. నిర్వహణ లోపంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ శుక్రవారం చర్యలు చేపట్టారు. రూ.20వేల జరిమానాతో పాటు మెడికల్ షాపులో లైసెన్స్ లోపాల కారణంగా ఐదు రోజుల పాటు సస్పెన్షన్ విధించారు. ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న కార్డియాలజీ వైద్యుని వివరాలు డీఎంహెచ్‌వో కార్యాలయంలో నమోదు చేయలేదు. గర్భస్థ శిశువు లింగనిర్ధారణ నిషేధ చట్టం ప్రకారం అవసరమైన హెచ్చరిక బోర్డులు ఆస్పత్రిలో ప్రదర్శించలేదు. ఆస్పత్రిలో వాహనాల పార్కింగ్ సదుపాయం లేకపోవడాన్ని సీరియస్‌గా తీసుకున్న కలెక్టర్ చర్యలకు పూనుకున్నారు. అలాగే ఆస్పత్రికి అనుబంధంగా ఉన్న మెడికల్ షాపులో షెడ్యూల్ ఎక్స్, ఔషధాల అమ్మకానికి అవసరమైన లైసెన్స్ తీసుకోకపోవడం, తనిఖీ సమయంలో మెడికల్ షాపులో ఫార్మసిస్టు లేకపోవడం, ఆస్పత్రిలో ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వైద్యుల అర్హతలు, వివరాలు డీఎంహెచ్‌వో కార్యాలయంలో నమోదు లేకపోవడం, హెచ్–1 రిజిస్టర్ నిర్వహణ లేకపోవడం, మందుల విక్రయాలకు సంబంధించిన రశీదులు చూపించకపోవడంతో ఆస్పత్రిపై చర్యలు తీసుకున్నట్లు డీఎంహెచ్‌వో వివరించారు.

ఆర్డీవో కార్యాలయంలో పెచ్చులూడిన పైకప్పు



కుర్చీపై పడిన రాళ్లు

కైలాస్‌నగర్: కలెక్టర్ కార్యాలయ భవనంలోని ఆదిలాబాద్ ఆర్డీవో కార్యాలయంలో శుక్రవారం ఉద్యోగులకు పెను ప్రమాదం తప్పింది. మధ్యాహ్నం 3గంటల సమయంలో భవనం పైకప్పు పెచ్చులు ఒక్కసారిగా ఊడిపడ్డాయి. దీంతో రికార్డు రూంలో విధులు నిర్వహిస్తున్న మహిళా రికార్డు అసిస్టెంట్ పక్కకు జరగడంతో తృటిలో ప్రమాదం నుంచి బయటపడింది. ఏళ్ల క్రితం నిర్మించిన భవనంలో ఆర్డీవో కార్యాలయాన్ని కొనసాగిస్తున్నారు. ఈ గదిలో రికార్డు అసిస్టెంట్, చైన్‌మెన్ రెగ్యులర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. తృటిలో ప్రమాదం నుంచి బయటపడటంతో వారు ఊపిరి పీల్చుకున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఉద్యోగులు కోరుతున్నారు.

అట్రాసిటీ కేసు నమోదుకు సిఫారసు

బెల్లంపల్లి: మండలంలోని బుగ్గ రాజరాజేశ్వరస్వామి ఆలయ పూజారి వేణుగోపాల్ శర్మపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదుకు రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషనర్ పోలీసులకు సూచించారు. పూజారి తనను వేధింపులకు గురి చేస్తున్నట్లు గుండ భీమక్క అనే మహిళ ఫిర్యాదు చేయడంతో సానుకూలంగా స్పందించిన ఎస్సీ, ఎస్టీ కమిషనర్ కేసు నమోదును పరిశీలించాలని రామగుండం సీపీని ఆదేశించారు.